# డైరీలో ఒక పేజీ — శ్యామలా విహారి

నులకమంచం వెనకాల పసుపు ముద్దలూ నీళ్ళూ చూసి, ఆ పైన అన్నంలో విరిగిన పాలూ-చూసినప్పటి ఖడ్గతిక్కన మనస్సులా వుంది రాఘవరావ్ మనస్సు.

ఒక్క క్షణంలో ఒక్క మాటతో తన గాలి తీసేసింది రాధ. ఆ సమయంలో ఆమె చూసిన చూపు మాత్రం?—కత్తి వాదరలా వుంది.

ఉదయం—

రాధ స్నానం చేస్తున్నదికదా అనే ధీమా తోనూ, లలిత వంటింట్లో తన పనిలో నిమగ్నమై వుందనే ధైర్యంతోనూ రాధ గదిలో కెళ్ళి టేబుల్ మీదున్న పుస్తకాలన్నీ వెతుకుతున్నాడు తను.

"నా డైరీ కావాలా బావా?" గదిలోకి ఎప్పు డొచ్చిందో ఏమో రాధ. ఉలిక్కిపడ్డాడు తను.

మళ్ళీ రాధే, "అది—ఆ పుస్తకాల్లో లేదు. నా సూట్‌కేసులో పెట్టాను రాత్రి" అంటూ గబగబా సూట్‌కేస్ తెరిచి అందులోంచి డైరీ తీసి తన కందిస్తూ చెయ్యిసాచింది.

తన ముఖంలో నెత్తురుచుక్క వుండివుండదనేది ఎవరూ చూసి వర్ణించక్కర్లేకుండానే తనకు తెలిసిపోయింది.

"అఁహఁహఁ డైరీకోసంకాదు. తెల్ల కాగితం కావాల్సి" అని బక్కెట్లకొద్దీ నీళ్లు నములుతూ బయటపడ్డాడు తను.

తన తల నేలవాలిపోయినా — ఆ పిల్ల చూపుల కొరడాలు మాత్రం తన కళ్ళని ఛెళ్ళు మనిపించినై.

కాళ్ళు శరీరాన్ని హాల్లోకి మోసుకొచ్చినై. తన టేబుల్‌మీది తెల్లకాగితాల దొంతరా, లెటర్‌హెడ్సూ, నోట్‌బుక్సూ—అన్నీ కలిసి కట్టుగా తనకేసి చూసి విరగబడి నవ్వినై.

ఎలా వచ్చి పడ్డాడో ఏమో తెలీదు—'జెయంట్‌వీల్' ఎక్కి కళ్ళు తిరిగినవాడు క్రిందికి దిగి భూమ్మీదికి చేరినట్లే ఆఫీసుకి చేరాడు.

అప్పటిదాకా వరండా బయటే ఆడుకుంటున్న ఈదురుగాలి, కిటికీగుండా లోపలికి పరిగెత్తుకొచ్చింది. రాఘవరావ్ టేబుల్‌మీది కాగితాలన్నీ చిందరవందరయినై—అతని ఆలోచనల్లాగానే.

జవాను కొండయ్యకోసం హాలంతా కలయజూశాడు.

రా.రావ్ కోరికల్లాగానే అతనెప్పుడూ రా.రావ్‌కి అందుబాటులో వుండడు. సీట్లోంచి లేచి వెళ్ళి తనే ఆ కాగితాల్ని ఏరుకొచ్చాడు. వాటిని సరిచేసి బరువు పెట్టుండగా అక్కడి కొచ్చేడు మేనేజరు.

"వెరీ సారీ మిష్టర్ రావ్. అఫీషియేటింగ్ అరేంజ్‌మెంట్ సుబ్రహ్మణ్యంకే యిమ్మని పై ఆఫీసువాళ్ళు ఖరారు చేశారు. అతనికంటే మీకు పాయింట్ టూ మార్కులు తక్కువట. ఈసారి అదీ కారణం. ఇదిగో కాగితం. అతని పేరున ఆర్డర్స్ తయారుచేయండి."

మేనేజర్ తన గదిలోకి వెళ్ళిపోయేడు.

రా.రావ్ ఉమ్మి మింగటానికి చాలాసేపు పట్టింది.

ఈలోగా ఈ వార్త ఆఫీసంతా గాలిలా వ్యాపించటం, అప్పటికప్పుడే—బయట మొదలైన వానచినుకుల్లా — సహోద్యోగులంతా రా.రావ్ దగ్గర చేరి 'సారీ'ల కన్నీళ్ళు వర్షించటం జరిగిపోయినై.

భార్యే మొగుణ్ణి పెళ్ళికొడుకును చేసినట్టు రా.రావ్ సుబ్రహ్మణ్యంకి ఆర్డర్సు కాగితాలు తయారు చేసిచ్చేసరికి లంచ్ టైమయింది.

రాకెట్‌నుంచీ విడిబడిపోయిన వ్యోమనౌకలా పరిసరాల్నించి విడిబడిపోయింది— రా.రావ్ మేధస్సు.

'నాలుగేళ్ళ క్రితం, అత్తగారుకూడా పోవడంతో రాధకు తనే గార్డియన్ అయినాడు రా.రావ్. మామగారు మిగిల్చిపోయిన ఇంటిని అద్దెకిచ్చి రాధను తమతో తీసుకొచ్చి కాలేజీలో చేర్పేరు. ఇప్పుడు రాధ బియ్యస్సీ ఫైనల్లో కొచ్చింది.

రాధ చలాకీపిల్ల. నిరంతర సాహిత్య పరనంలో తనవైని కొన్ని భావాల్ని పెంపొందించుకుంది ఆమె. విద్యార్థులతో కలుపుగోరుగా వుంటూ, ఆటలూ, పిక్నిక్లకూ వాటికీ వెళ్తూ వుండడం, సాహిత్య సభల్లో ఉపన్యాసాలూ వగైరా—ఆమె హాబీలుగా ఎన్నుకుంది.

ఆర్నెల్ల క్రితం రా.రావ్‌తో అతని భార్య లలిత అన్న మాటలు బాగా అతని బుర్రలో కెక్కినై. "దీని పద్ధతులూ మాటలూ చూస్తుంటే నా కెందుకో భయంగా వుంటోందండీ. దాని చొరవ, చిలిపితనం ఏం ప్రమాదం తెచ్చిపెడతయ్యో ఏమో! నేనూ కాలేజీలో చదివానుగానీ, ఇంతలాలేవు—మా రోజులు" అన్నది లలిత.

ఆ రాత్రి రాధగురించే ఆలోచిస్తుంటే, రా.రావ్‌కి తొలిసారిగా వో ఆలోచన తట్టింది.

రాధకి ప్రతిరోజూ డైరీరాసే అలవాటుంది. ఆ డైరీని చదివితే అన్నీ విశదమైపోతాయి. ఈ ఊహ అతనికి కొత్త వుత్సాహాన్నిచ్చింది.

రాధ ఆ డైరీలో ఏం వ్రాస్తుందసలు?-ఆమెకేమైనా ప్రేమవ్యవహారాలున్నాయా?—లలిత మాటలూ ఈ సందేహాన్నే సూచిస్తున్నయ్.

అప్పట్నుంచీ తను అందుకు ప్రయత్ని



స్తూనే వున్నాడు. కానీ వీలుకావడం లేదు. రాధడైరీ అందినట్లే అంది జారిపోతోంది.

నిన్నసాయంత్రం జరిగిన సంఘటన-రాధ డైరీ చూడాలన్న రా.రావ్ కోర్కెని మరింత తీవ్రతరం చేసి రాత్రల్లా అతనికి పిచ్చెక్కేటం చేసింది.

—నిన్నసాయంత్రం, తను స్నానానికి బావిదగ్గరికి వెళ్ళాడు.

రాధ నూతిగట్టుమీద కూర్చుని మినపప్పు కడుగుతోంది.

ఆకాశం అంచున దిగిపోతున్న సూర్యుడి కిరణాలు కన్నెపిల్లతో పరిహాసాలాడుతుంటున్నై.

రాధకేసి పరీక్షగా చూశాడు తను. మందార పువ్వు ముదురు ఎరుపులోని నలుపు ఛాయ. వుంగరాలజుట్టు. ఎర్ర అంచున్న తెలుపు నేత చీరమీద ఎరుపురంగు జాకెట్ వేసుకుంది. పైట కిందికి పడివుంది. మెడకింద జాకెట్ మధ్యలో తనచూపు నిలిచిపోయింది. గుండ్రటి సీడ దోసిలిపట్టిన ఆకాశంలో విస్తరించిందక్కడ.

రాధ క్రీగంట తనవైపు చూసింది. సన్నగా నవ్వింది. రెండుచేతులూ బక్కెట్‌లో ముంచి కడుక్కుని లేచి నిలబడింది.

"ఏమిటి బావా, బుచ్చిబావగారి మధుసూదనంలా చూస్తున్నావ్. అక్కకంటే అందంగా వున్నానా?" అంటూ పమిట సర్దుకుని కొంగుకు చేతులు తుడుచుకుంటూ ఇంట్లోకి వెళ్ళిపోయింది.

తను సిగ్గుతో కళవళపడ్డాడు.

"అక్కా, బావ నిన్ను పిలుస్తున్నాడే" అని వినిపించిన రాధ మాటలు తన తత్తరపాటుని మరీ ఎక్కువజేసినై.

రాత్రంతా మనసు మనసులో లేదు. ఈ సంఘటనని గురించి రాధ తన డైరీలో ఏమని వ్రాసింది?—ఇదీ తన యిప్పటి ఉత్సుకత. అందుకనే యివ్వాళ పొద్దున రాధ గదిలోకి వెళ్ళాడు. పర్యవసానం—భంగపాటు!

'భంగపాటు' అనుకోగానే రా.రావ్ ఆలోచన అఫీషియేటింగ్ పోస్టుమీదికి మళ్ళింది.

గతంలోనూ ఓసారి ఇలాగే జరిగింది. తనకు రావలసిన పోస్టింగ్ మరెవరికో ఇచ్చారు. హెడ్ఆఫీస్ మీద దండయాత్ర ప్రకటించి సాధించాడు. ఇంతా చేస్తే తను ఆ పోస్టులో పన్చేసింది ఒక నెల్లాళ్ళు మాత్రమే. ఆ నెలకూ అధికంగా వచ్చే జీతం-నలభై రూపాయలూ-సెక్షన్‌లోనూ, బయటా పార్టీలకు చాల్లేదు. ఉపయోగం లేని శ్రమే మిగిలేది. ఇప్పుడూ జరిగేది అంతే. కోక్లర్క్ శేఖరం యిందాక అన్నాడు. "పీడా పోయిందిలే పోనీవోయ్ రాఘవరావ్. దానివలన దమ్మిడీ ఆదాయమూ లేదు, క్షణం తీరికాలేదు. ఎందుకొచ్చిన యాతన! ఏక్ దిన్‌కా సుల్తాన్ గిరీ" అని. అయినా-తనకా 'ఛాన్స్' పోయిందంటే ఏదో వెలితిగా వుంది మనసులో.

లంచ్ అవర్ అయిపోయింది.


రా.రావ్ ప్రస్తుతంలో కొచ్చాడు.

జీతాలు వచ్చినై.

రా.రావ్‌కి ఆ రోజు జీతాలరోజన్న స్పృహే లేదు. జీతాలకవర్లని తరుముకుంటూ చాలా 'లిస్టులు' వచ్చినై. అవన్నీ పెళ్ళిళ్ళకూ, తద్దినాలకూ చందాలూ, యూనియన్‌లకూ, దేశ నిర్మాణ కార్యక్రమాలకూ సభ్యత్వాలూ—బాపతు. ఆ వెంటనే అప్పుల వాళ్ళూ, వాయిదా పద్ధతిని వస్తువులమ్మిన వాళ్ళూ తయారు.

నరసింహం వచ్చాడు. అతనికి ముప్పై రూపాయలిచ్చాడు రా.రావ్. 'ఇది ఎనిమిదో నెల. ఇంకా ఏడు వాయిదాలున్నై సార్' అంటూ వెళ్ళిపోయాడు నరసింహం. అతని దగ్గర అయిదువందల యాభైకి అతని ఎత్తు స్టీల్ బీరువా కొన్నాడు రా.రావ్. కొనేటప్పుడు వందరూపాయలిచ్చి, మిగిలిన సొమ్ము పదిహేను వాయిదాల్లో తీర్చేట్టు ఒప్పందం.

తన యింట్లో మధ్యగదిలో గోడకానించి పెట్టిన బీరువా కళ్ళముందు మెదిలింది రా.రావ్‌కి. శేఖరంతోపాటు ఆఫీసులో అందరూ కొంటుంటే తనకూ దాన్ని తీసుకోవాలనిపించింది. తీరా తీసుకున్న తర్వాత తనకది ఎంత




పనికిరాని వస్తువో తెలిసింది. అందులో వుంచ దగిన వస్తువే కనిపించలేదు. అతిత్రీవ్రంగా ఆలోచించిన తరువాత వో వస్తువు కనిపించింది-అది తన సూటు.

ఈ ఉద్యోగంలో చేరేముందు, అంటే ఇప్పటికి పదేళ్ళక్రితం-తనకు సూటుమీదా, బూటుమీదా తగని మోజుగా వుండేది. ఎంతో పోరుపెట్టీ, నానా తిట్లుతినీ అన్నయ్యచేత 'యస్' అనిపించుకున్నాడు. తీరా వాటిని ఒకటి రెండుసార్లు తొడుక్కోగానే తెలిసింది-తనకవి యెంత అవసరంలేని వస్తువులో....

ఆ రోజుల్లో—తనని సూట్‌లో చూసిన స్నేహితులూ, చుట్టుప్రక్కల వాళ్ళూ "నిరుద్యోగికి నీకెక్కువ' అని అదోలా నవ్వేవాళ్ళు. ఆ తర్వాత ఉద్యోగంలో చేరిన కొత్తల్లో వోసారి తొడుక్కున్నాడు. 'కింది బెత్తు గుమాస్తాగారూ, మీరూ సూటూ బూటేస్తే 'మింగ మెతుకులేదు, మీసాలకు సంపెంగ నూనె' అంటారని సలహా ఇచ్చాడు శేఖరం.

ఆ తర్వాత తనెప్పుడూ దాన్ని తొడగలేదు. ఇప్పుడు బీరువాలో కెక్కించాడు.

బీరువా కొనబోయే ముందు లలిత అననే అంది, 'మనకిప్పుడు బీరువా అక్కర్లేదండీ, అలంకార విద్యార్థిలా అదొకటెందుకు? పాత గుడ్డలూ, పెన్సిళ్ళూ, స్టౌవత్తులూ, దారం రీలూ పెట్టుకోవాల్సిందే' అని. నిజానికి అంతే జరిగింది. కానీ దానికోసం తనెంత తాపత్రయ పడ్డాడు. శేఖరంవాళ్ళూ కొన్నప్పుడు తనేదో కోల్పోతున్నట్టు ఫీలై మరీ చేరేడు ఆ స్కీములో!

సాయంత్రమైంది.

ఆఫీస్ కాగానే ఇంటికి వెళ్ళాలనిపించలేదు రావ్‌కి. హోటల్లో కాఫీ తాగి పేవ్‌మెంట్ మీద నడుస్తుంటే—కాళ్ళు-అప్రయత్నంగా అక్కడికే దారి తీసినై.

నూరేఖాన్ పుస్తకాల షాపు! పాతపుస్తకాల అంగడి. అరగంట గడిచింది. 'కంప్లీట్ వర్క్స్ ఆఫ్ షేక్స్పియర్' తీశాడు రావ్. పదిరూపాయలు చెప్పాడు ఖాన్. ఐదు దగ్గర మొదలెట్టేడు రావ్. ఐదున్నర, ఆరు, ఆరున్నర - ఆపైన 'ఏడు' అని పుస్తకం రావ్‌చేతిలో వుంచాడు ఖాన్. ఖాన్ మాటలో వక్రోక్తి పలికిందనిపించింది రావ్‌కి. పుస్తకం తీసికొని

డబ్బులిచ్చాడు. టైము చూసుకున్నాడు. ఆరు న్నరయింది.

పార్క్కొచ్చి కూర్చున్నాడు.

జారుడుబండమీద పిల్లలు ఆడుకుంటు న్నారు. రోజ్ గార్డెన్లో ఓ పడుచుజంట— కబుర్లు చెప్పుకుంటూ మధ్యమధ్యలో నవ్వు కుంటున్నారు. మరోవైపు ఎవరో వ్యాయామం చేస్తున్నారు. అక్కడక్కడా కూర్చునివున్నారు కొందరు. ఎవరి ధోరణిలో వాళ్ళున్నారు.

చేతిలోవున్న పుస్తకాన్ని తిరగేయసాగేడు రావ్. ఒక్కసారి అంతా తిరగేసి ప్రక్కన పెట్టాడు. వెంటనే, ఇంట్లో అటకమీద జాజి చెక్కల పెట్టెలో వున్న పుస్తకాలన్నీ కళ్ళ ముందు మెదిలేయి. అవన్నీ ఇలా అప్పు డప్పుడూ కొన్న పుస్తకాలే. తన కదొక అల వాటు. మంచి పుస్తకం చూస్తే దాన్నెలాగైనా సరే కొనాలనిపిస్తుంది. ఎన్నోసార్లు ఫ్రెండ్స్ దగ్గర అప్పుచేసికూడా కొన్నాడు.

వోసారిలాగే పాత పుస్తకాల షాపులో 'రెడ్డి సంచిక' కనపడింది. ఆ రోజు తనదగ్గర అసలు డబ్బుల్లేవు. ఆ కొట్టువాడిని మర్నాటి దాకా ఆ పుస్తకాన్ని ఎవరికీ అమ్మవద్దని బ్రతి మాలీ బామాలీ, మర్నాడు వెళ్ళి దాన్ని కొను క్కొచ్చేడు. సాహిత్యంలో తనకేమాత్రం ప్రవేశం లేదు. అయినా అది చాలా అరుదైన పుస్తకమని దాన్నిగురించి శాస్త్రి ఎప్పుడూ చెప్తూ వుండేవాడు. అలా కొన్న ఆ పుస్తకాన్ని ఒక్కసారికూడా చదవలేదు. అదనేకాదు— అసలే పుస్తకమైనా అంతే! ఎన్ని పుస్తకాలు కొన్నా, తనకు వాటిని చదవాలనిపించదు. పేజీలు తిరగేసి తీసికెళ్ళి అటకెక్కించటమే— తను చేసేపని.

వోసారి శాస్త్రి అన్నాడు, "కనబడిన పుస్తక మల్లా సేకరించటమేగానీ చదవవుకదా! ఎందు కింత పిచ్చి" అని.

ఉన్నట్టుండి ఏదో గలభాలాంటిది వినపడే సరికి ఈ లోకంలో పడ్డాడు రావ్.

తనకు కొద్ది దూరంలో వో జంట—వాళ్ళ ముందు 'అమూల్' బేబీలాంటి పిల్లాడు. ఆ ప్రక్కనే వో ఐస్క్రీం అమ్మే కుర్రాడు. ఆ చిన్న పిల్లాడు ఐస్కోసం మారాం చేస్తుంటే - తల్లి వాణ్ణి విసుక్కుంటోంది. వాడు ఏడుపు మొదలెట్టేడు. 'పిల్లాడి ఏడుపును భరించలేక ఐస్వాణ్ణి పిలుస్తున్నాడు భర్త. ఆవిడ వారిస్తూ అంది, 'వాడి సంగతి తెలీదు మీకు. వాడికి ఆకల్లేదండీ అదసలు. తినడు. కొనిపించి, చివరికి నాకే ఇస్తాడు. నే తినలేను బాబూ ఇప్పుడు' అని. భర్త చివరికి ఐస్ కొననే కొన్నాడు.

సంతోషంతో గంతులేస్తూ ఐస్ అందు కున్నాడు పిల్లాడు. ఒక్కసారి నాలికతో రుచి చూసి—ఆముదం తాగిన మొహంపెట్టి, 'బాగా లేదం'టూ తల్లి చేతికిచ్చేశాడు. ఆవిడ దాన్ని అందుకుంటూ 'చూశారా' అన్నట్టు భర్తకేసి గుర్రుగా చూసింది. అక్కణ్ణుంచీ కదిలేరు వాళ్ళు.

రా.రావ్కి తన చిన్నతనం గుర్తుకొచ్చింది.

అప్పుడు తనకు పదేళ్ళుంటాయి. అప్పట్లో తనకు తరచూ జ్వరంవస్తూ వుండేది. ఓసారి పండక్కి లడ్డూలు చేసింది అమ్మ. అవి తిన కుండానే తనకు జ్వరం ముంచుకొచ్చింది. లడ్డూ తినాలని ఎంత గొడవచేసినా తిననీయ లేదు అమ్మ. 'నీకోసం దాచాను. జ్వరం తగ్గాక తిందువుగానీ' అని అమ్మ చెప్తే, రెండు లడ్డూలు తీసికుని ఓ చిన్న డబ్బాలో పెట్టి, తన మంచం దగ్గరే వుంచుకున్నాడు ఆ డబ్బాని. ఎవ్వర్నీ ఆ డబ్బా ముట్టుకోనిచ్చేవాడు కాదు. జ్వరం తిన్నగా టైఫాయిడ్లోకి దించింది. పది హేను లంఖణాలు చేసి పథ్యం తిన్నాక, డబ్బా మూత తీశాడు. అందులో లడ్లు బూజుపట్టి భద్రంగా వున్నాయి. వుసూరుమంటూ వాటిని అవతల పారేశాడు.

"హల్లో, రాఘవ్."

ఆలోచనల్లోంచి తేరుకుని తల తిప్పేడు రావ్. ఎదురుగా శంకరం. శంకరం ప్రక్కగా అతని భార్య కాబోలు వుంది. శంకరంకేసి చూసి విష్చేశాడు.

"బాగున్నావా? చాలా కాలమైంది మనం కలిసి" రావ్ ప్రక్కగా కూర్చుంటూ పరామ

ర్శించేడు శంకరం. రావ్ సన్నగా నవ్వేడు.

"బై దిబై. ఈవిడ శారద. నా శ్రీమతి" శంకరం తన భార్యని పరిచయం చేశాడు. ఆవిడ నమస్కరించింది. రావ్ ప్రతినమస్కారం చేశేడు.

"ఇక్కడే స్టేట్ బ్యాంక్‌లో వర్క్ చేస్తోంది. మా పెళ్ళికి నువ్ రాలేదు; ఆ తర్వాత మనం కలుసుకోనేలేదు" అంటూ చేతిలో హెల్మెట్‌ని పక్కన పెట్టాడు. అతని కటుప్రక్కగా కూర్చుంది శారద.

కటుర్లలో పడ్డారిద్దరూ. సుమారు ఓ అర గంట తర్వాత—శంకరం, శారదా లేచారు. వోసారి రావ్‌నీ, లలితనీ తమ యింటికి రమ్మని చెప్తూ, అడ్రసిచ్చి వెళ్ళిపోయారు.

రావ్ మనస్సు బరువెక్కింది.

తన పెళ్ళికి ముందు సంఘటనలూ, తన వుద్దేశ్యాలూ గుర్తుకొచ్చినై.

అన్నయ్య ఎన్ని సంబంధాలు చెప్పినా తనకు నచ్చలేదు. 'పిల్ల కనీసం గ్రాడ్యుయేట్ అయివుండాలి' అనే తన అభిప్రాయాన్ని విన్నప్పుడు వదిన నవ్వుతూ అంది, "అయితే వుద్యోగం చేయిస్తావన్న మాట!" అని.

తను సమాధానం యివ్వలేదు.

లలిత 'బియ్యే' పాసయ్యింది. పెళ్ళయిన కొత్తల్లో ఆమె చూపులు పేపర్లో వాంటెడ్ కాలమ్స్‌మీద వుండేవి. వోసారి ఏదో బ్యాంక్ వాళ్ళు ఉద్యోగ పోటీ పరీక్షని ప్రకటించారు. తనుకూడా అప్లయ్ చేస్తానంది లలిత. తానే వద్దన్నాడు. అంతేకాదు, 'తన ముందెప్పుడూ వుద్యోగ ప్రసక్తి తేవద్ద'ని ఖచ్చితంగా చెప్పాడు.

శారదనిచూస్తే అనిపిస్తోంది. లలితకుకూడా ఆ అవకాశమిస్తే బాగుండేదని.

పెళ్ళికాకముందు తన వూహల్లో భార్యచేత వుద్యోగం చేయించాలనే వుండేది. తీరా బియ్యే చదివిన లలిత భార్యగా లభించినా, ఉద్యోగం చేయించటానికి ఎందుకో మనస్కరించలేదు.

రా.రావ్ మీద ఏదో పడ్డట్లనిపించి వులిక్కిపడి లేచాడు. టైము చూసుకున్నాడు. ఎనిమిదిన్నర అవుతోంది. నెమ్మదిగా ఇవతలకు వచ్చాడు. లైట్ల వెలుగులో రంగు రంగుల గులాబీలు కళ్ళకు విందుచేస్తున్నాయి. చాలా ముచ్చటగా వున్నాయనిపించింది రావ్‌కు. తప్పని తెలిసినా అరచేతి వెడల్పులోవున్న వో పువ్వుని తుంచి గబగబా అడుగులువేస్తూ రోడ్డు మీదికొచ్చాడు.

కాళ్ళు యింటిముఖం పట్టేయి. రాధను గురించిన బెరుకుదనం మళ్ళీ తలెత్తింది.

చేతిలో పువ్వుతో ఆడుకుంటూ, ఒకొక్క

## 'కలియుగ భీముడు'



ఓరోజు నాలుగు రోడ్లు కలిసేచోట ఎత్తుగా నాలుగు బల్లలు పేర్చి, ఓ వ్యక్తి మైకులో 'మీరు భీముడ్ని చూడలేదు, చూడలేరు, చూడబోరు - కాని, కలియుగ భీముడ్ని చూద్దురు రండి. అతను ఓ అరగంటలో నాలుగువందల కోడిగుడ్లు, రెండువందల బాతుగుడ్లు ఇట్టే తినేయగలడు. రండి రండి—చూడండి. అతనితో పోటీపడి గెలిచిన వారికి వెయ్యి రూపాయిలు బహుమానం" అంటూ మైకులో అరుస్తూంటే జనం బిలబిలమంటూ చుట్టూ మూగిపోయారు. ఆలస్యాన్ని భరించలేక కలియుగ భీముడు మైకులో ఎనౌన్స్ చేస్తున్న తన బాసునుద్దేశించి అన్నాడు గదా-"అయ్యా తమరు త్వరగా ఈ కార్యక్రమాన్ని ముగిస్తే నేను ఇంటికిపోయి భోంచెయ్యాలి" అని.

—నాని

రేకునూ తుంచుతూ నడక సాగించాడు.

ఇల్లు కనుచూపు దూరంలో వుండగా రావ్ చేతిలో పువ్వు తాలూకు కాడకూడా మిగల్లేదు.

చేతిలోని పుస్తకాన్ని వూపుకుంటూ ఇల్లు చేరేడు.

గుమ్మానికున్న తాళం వెక్కిరించింది రావ్‌ని.

రావ్ మనస్సు పరిపరివిధాలా పోసాగింది.

లలితా రాధ ఎక్కడికి వెళ్ళారన్నది తోచ లేదు. పక్క పోర్షన్‌కేసి భారంగా అడుగులు వేశాడు.

రావ్‌నుచూసి పక్కింటివాళ్ళ పిల్ల తాళం చెవీ, వో కవరూ తెచ్చి రావ్ చేతిలో పెట్టి గిరుక్కున పరిగెత్తుకెళ్ళింది.

రావ్ మనస్సు ఆందోళన పడింది. ఉదయం సంఘటన వెన్ను చరచింది.

రాధ లలితకు ఏం చెప్పిందో ఏమో?—

ఏవేవో ఆలోచనలు ముసురుకున్నై రావ్‌ని. గబగబా తలుపు తెరిచి, లైట్ వేసుకుని కుర్చీలో కూర్చున్నాడు.

చేతిలోని పుస్తకాన్ని టేబుల్ మీదికి పడే శాడు.

తడబడుతున్న చేతుల్తో కవరు చించి ఆత్ర తగా చదివేడు.

"మీ కోసం చూసి చూసి సినిమాకు వెళ్తున్నాం. 'పలిచీమలు' సినిమా ఈ రోజుతో ఆఖరుట. మీరు భోంచేసేయండి. అన్నీ సిద్ధంగా వుంచాను."

'హమ్మయ్య' అని తేలిగ్గా వూపిరి పీల్చు కున్నాడు రావ్. కవరు టేబుల్ మీద వుంచుతూ వులిక్కిపడ్డాడు.

టేబుల్ మీద తన లెటర్ హెడ్స్ పైగా రాధ డైరీ!

రావ్ గుండె బిగదీసింది.

వణుకుతున్న చేతులతో నెమ్మదిగా డైరీని అందుకున్నాడు.

లేచివెళ్ళి బయట తలుపు గడియ వేసి వచ్చాడు.

మళ్ళీ కుర్చీలో కూర్చుని డైరీలోని పేజీలు తిరగేయటం మొదలెట్టేడు.

డైరీ అంతా—

రాధ తాను చదివిన పుస్తకాల్లోంచి ఎత్తి రాసుకొన్న కొటేషన్లూ, రచయితల పేర్లూ, తను వ్రాసిన కవితలూ; వాటిల్లో రకరకాల కొట్టివేతలూ—కరెక్షన్లూ!

రావ్‌కి ఆశ్చర్యం వేసింది. గబగబా పేజీలు తిరగేసి నిన్నటిరోజు వ్రాసిన పేజీ చూశాడు.

అక్కడ, తననిగురించేమీ లేదు. ఏదో కథకు సంబంధించిన వివరాలు వ్రాసివున్నయ్.

పేజీ తిరగేశాడు. అది ఈరోజు తారీఖుది:

"లోకంలో మనుష్యుల్ని పట్టి పీడిస్తున్న దౌర్భాగ్యం చాలా చిత్రమైంది. ఒక వస్తువు తనకు నిరుపయోగమైందని తెలిసినా, దాన్ని పొందాలనే తపనా, ఆరాటం; అది తనకు లభించినా దాన్ని అనుభవించలేని అశక్తత!"

రావ్ గతుక్కుమన్నాడు.

అద్దంలో తన ప్రతిబింబం చూసుకున్న ట్లయింది.

'అటకెక్కిన పుస్తకాలూ, అలంకార విద్యార్థిలా స్టీలు బీరువా, పాతబడిపోతున్న సూటూ, చివికిపోతున్న లలిత బియ్యే డిగ్రీ, పాడైపోయిన లడ్డూలు, రేకులు తుంచేసిన గులాబీ—' ఇవన్నీ సినిమా రీలులా రావ్ కళ్ళముందు తిరిగి అతన్ని పరిహసిస్తున్నయ్.

వీటన్నిటికీ మధ్యగా రాధ డైరీ అతన్ని చూసి విరగబడి నవ్వుతోంది!!